సాక్షి
తిరుపతి
శనివారం । 4 । మార్చి । 2023



అశేష జనవాహిని మధ్య తెప్పోత్సవం (ఇన్‌సెట్) తెప్పపై శ్రీరామచంద్రమూర్తి అలంకరణలో మలయప్ప

శ్రీరామ..ఓ రామ!

పండితుల వేదమంత్రాలు.. భక్తుల గోవిందనామ స్మరణ మార్మోగుతుండగా పుష్కరిణిలో శ్రీమలయప్ప స్వామి సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి అలంకరణలో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తెప్పలపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లను వీక్షించి తరించారు. గోవిందుడిని స్మరిస్తూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగితేలారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఉత్స వర్లు ఊరేగుతుండగా కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

- తిరుమల

న్యూస్‌రీల్

గణనాథునికి మహా హారతి



కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పుష్కరిణిలో శుక్ర వారం రాత్రి మహా హారతి సమర్పించారు. లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనము పూజల్లో భాగంగా వినాయక స్వామి, గంగాదేవికి విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి తొలుత హారతులు ఇచ్చారు.

పెండింగ్ బిల్లులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: హౌసింగ్‌కు సంబంధించి పెండింగ్ బిల్లులు త్వరలో పూర్తిచేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం జేసీ డీకే బాలాజీతో కలిసి రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. పాగాలి, శ్రీనివాసపురం, అగరాల, చిందేపల్లి, దుర్గసముద్రం, సీర్పాకోట లే ఔట్ల పై సమీక్ష నిర్వహించారు. ఉగాదినాటికి లక్ష్యాలను అధిగమించాలన్నారు. డీఆర్వో శ్రీనివాసరావు, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు కనకనరసా రెడ్డి, రామారావు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. దర్శన టికెట్లు లేని వారికి 14 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది.

12న సామూహిక షష్టిపూర్తి మహోత్సవం

తిరుపతి కల్చరల్: తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో బైరాగిపట్టిడలోని వైఖానస ఆశ్రమంలో ఈనెల 12న ఉదయం 6 గంటలకు సామూహిక షష్టిపూర్తి మహోత్సవం, భీమ రథ శాంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. ఇందులో పాల్గొన దలచిన వారు తమ వివరాలతో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 8309731254, 9052844442 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.


అమ్మవారి సేవలో దేవదాయశాఖ కమిషనర్



అమ్మవారి ఆలయం వద్ద హరిజవహర్‌లాల్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం ఉదయం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా దేవదాయశాఖ అధికారి పుట్టా రామకృష్ణారెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.


24, 25 తేదీల్లో -2కే 23



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 24, 25వ తేదీల్లో సదర్వవ -2కే23 పేరుతో జాతీయ స్థాయి సాంకేతిక్ ఉత్సవ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు పోస్టర్లను శుక్రవారం ప్రొఫెసర్ మల్లికార్జున, ప్రొఫెసర్ సత్యనారాయణ తదితరులు ఆవిష్కరించారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటిద్దాం



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుపతి తుడా: ప్రతి ఫ్రైడేను డ్రై డేగా పాటించి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నిర్మూలిద్దామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ప్రకాశం రోడ్డులోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ఫ్రైడే - డ్రై డే అమలును తనిఖీ చేశారు.

పెట్టుబడుల వెల్లువ

- తిరుపతి ఈఎంసీలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు
- వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఎంఓయూలు కుదుర్చుకున్న అధికారులు
- ఈఎంసీ సీఈఓ గౌతమి వెల్లడి



గౌతమి, ఈఎంసీ సీఈఓ

సాక్షి, తిరుపతి: తిరుపతి ఈఎంసీలో రూ.10వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు సీఈఓ గౌతమి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం విశాఖలో రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023లో భాగంగా తిరుపతి, కడప జిల్లాల పరిధిలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లలో పరిశ్రమల స్థాపన, పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ముందుకు వచ్చినట్టు వెల్లడించారు. తిరుపతి, కడప ఈఎంసీ క్లస్టర్ల పరిధిలో పరిశ్రమల స్థాపనకు రోడ్డు, రవాణా, రైలు మార్గం, విమానాశ్రయం వంటి అనుకూల రవాణామార్గాలు ఉన్నాయని, అలాగే మానవ వనరులకు కేంద్ర విద్యాసంస్థలు, విశ్వ విద్యాలయాలు తదితర అత్యంత సౌకర్యవంతమైన



పరిస్థితులు ఉన్నాయని ఆమె వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల స్థాపనకు అన్ని అనుమతులు త్వరితగతిన అందించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహిస్తోందని, అందులో భాగంగా శుక్రవారం ఈఎంసీ క్లస్టర్ల పరిధిలో సుమారు రూ.10,072 కోట్ల పెట్టుబడితో 29 వేల మందికి ఉపాధి కల్పన దిశగా ప్రముఖ కంపెనీలు ముందుకు వచ్చాయని ఆమె పేర్కొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన కంపెనీలు

- సన్నీ ఒప్పో టెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ మొబైల్ కెమెరా మాడ్యూల్స్ రూ.2,500 కోట్ల పెట్టుబడితో 10వేల మందికి ఉపాధి.
- టీసీఎల్ గ్రూప్ ప్యానెల్ మాన్యుఫాక్చరింగ్ రూ.5 వేల కోట్లు, 5 వేల మందికి ఉపాధి.
- క్లైర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఎల్‌ఈడీ మాన్యుఫాక్చరింగ్ రూ.90 కోట్లు, 3 వేల మందికి ఉపాధి.
- నియోలింక్ గ్రూప్ 5జీ ప్రొడక్ట్స్ మాన్యుఫాక్చరింగ్ రూ.300 కోట్లు, 3వేల మందికి ఉపాధి.
- ఎస్2పీ సోలార్ సిస్టం ఎల్‌ఎల్‌పీ కంపెనీ సోలార్ సెల్ మాన్యుఫాక్చరింగ్ రూ.850 కోట్లు, 900 మందికి ఉపాధి.
- సెల్కాన్ రేసోల్యూట్ కంపెనీ ఎల్‌ఎల్‌పీ ప్యానెల్ అండ్ టీవీ మాన్యుఫాక్చరింగ్ రూ.1,200 కోట్లు, 5.500 మందికి ఉపాధి.
- వర్చువల్ మేజ్ కంపెనీ జీపీఎస్ ట్రాకర్ ఈవీ బ్యాటరీ పీసీబీ రూ.80 కోట్లు, 1,400 మందికి ఉపాధి
- టెక్నో డోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ టీవీ మాన్యుఫాక్చరింగ్ రూ.52 కోట్లు, రెండు వందల మందికి ఉపాధి.

ధన్యవాదాలు



తిరుపతిలో మల్టీ మోడల్ బస్సు పోర్ట్, మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సమ్మతించారు. ఈ మేరకు శుక్రవారం విశాఖ వేదికగా జరిగిన సమ్మిట్‌లో ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. –గురుమూర్తి, తిరుపతి ఎంపీ

తిరుపతిలో 22ఏ సమస్య పరిష్కరిస్తాం

తిరుమల: తిరుపతిలో భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరిస్తామని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి చెప్పారు. భూములు రిజిస్ట్రేషన్ చేయరాదని ప్రభుత్వానికి పంపిన లేఖను తాత్కాలికంగా నిలిపివేయాలని మరో లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు. టీటీడీ భూములను సబ్ డివిజన్ చేసి వాటి రిజిస్ట్రేషన్లు మాత్రమే నిలిపివేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీకి చెందిన కొన్ని సర్వే నంబర్లలోని విస్తరణ, సబ్ డివిజన్ల డూప్లికేషన్‌లను సరిచేసి మరో జాబితాను ఎండోమెంట్స్ కమిషనర్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు వివరాలు అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ‘డయల్ యువర్ ఈఓ’ కార్యక్రమం అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జిల్లాలోని తిరుపతి మండలం, తిరుపతి డివిజన్‌లో ఉన్న వివిధ సర్వే నంబర్లలో చాలా వరకు విస్తరణలు డూప్లికేషన్ అయ్యాయని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, ఐజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో ఏర్పడిన పొరపాట్లు సరిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 7,126.85 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న టీటీడీకి చెందిన 960 స్థిరాస్తుల్లో 690 ఆస్తులు, 6,657.43 ఎకరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. అందులో తిరుపతిలోనే దాదాపు 3,663 ఎకరాలు ఉన్నట్లు చెప్పారు. వివిధ కోర్టు కేసుల పరిధిలో 584 ఎకరాలు వివాదంలో ఉన్నాయని వివరించారు.

ఐఎఫ్‌పీ బోర్డుపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నూతన విద్యా విధానంలో భాగంగా బైజూస్ కంటెంట్, డిజిటల్, స్మార్ట్ పద్ధతిలో విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులకు ఇన్‌ట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)పై అవగాహన అవసరమని తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. ఐఎఫ్‌పీ విద్యావిధానం అందుబాటులో ఉన్న స్థానిక సైప్రస్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐఎఫ్‌పీ బోర్డు విధానం త్వరలోనే జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం సైప్రస్ పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ ఐఎఫ్‌పీ బోధన విధానాన్ని వివరించారు. డీవైఈఓ రఘురామయ్య, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్రాజు, ఎంఈఓ తిరుమలరాజు, పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ‘సుస్థిరాభివృద్ధి- లక్ష్యాల ప్రగతి’పై సమీక్ష

తిరుపతి అర్బన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు చేపడుతున్న చర్యలకు సంబంధించి శాఖల వారీగా నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 4, 5 తేదీల్లో సీఎంఓ కార్యాలయ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా.సమీర్‌శర్మ తిరుపతికి విచ్చేసి సుస్థిర అభివృద్ధి–లక్ష్యాల ప్రగతికి సంబంధించి అధికారులతో శనివారం సమీక్ష నిర్వహిస్తారని వెల్లడించారు. అధికారులు సంబంధిత నివేదికలు సిద్ధం చేసు కోవాలని సూచించారు. డీఈఓ వి.శేఖర్, జిల్లా ప్రణాళికాధికారి అశోక్‌కుమార్, డీఎల్‌డీఓ సుశీలాదేవి, మహిళా శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి జయలక్ష్మి, డీఎంహెచ్‌వో శ్రీహరి పాల్గొన్నారు.

సీనియర్ ఫెన్సింగ్ జిల్లా జట్టు ఎంపిక రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీదేవి కాంప్లెక్స్‌లోని తైక్వాండో అకాడమీ హాల్‌లో ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్స్ ఫెన్సింగ్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు చిత్తూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.సాయి దిలీప్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుండాలని, ఇక్కడ ప్రతిభ చాటిన వారు ఈ నెల 10వ తేదీన కాకినాడలో నిర్వహించనున్న 9వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 91006 40712, 9885371500 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పాలు ఆ పేయ రాదని!

- మేలు జాతి పేయ దూడల ఉత్పత్తే లక్ష్యం
- రాష్ట్రీయగోకుల్ మిషన్ ద్వారా పునరుత్పత్తి
- రూ.1,350 విలువచేసే వీర్య ఇంజక్షన్ రూ.500కే
- ఉమ్మడి జిల్లాలో పాల ఉత్పత్తే ధ్యేయంగా అడుగులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు



గతంలో అవస్థలు పడేవాళ్లం



నా పేరు రమేష్. మాది అడవికొడియంబేడు గ్రామం, పిచ్చాటూరు మండలం. మాకు ఏడు పశువులు ఉన్నాయి. గతంలో గర్భధారణ కోసం మా పశువులను సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లేవాళ్లం. అధిక మొత్తం వెచ్చించి ఇంజక్షన్‌లు, మందులు కొనుగోలు చేసేవాళ్లం. ఒక్కోసారి ఫలితం ఉండేది కాదు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో మేలురకం కట్టు ఇంజక్షన్‌లు సబ్సిడీకే పంపిణీ చేస్తున్నారు. ఒకవేళ కట్టు నిలబడకపోతే మేము ఇచ్చే రూ.500 తిరిగి ఇచ్చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇంటివద్దకే వచ్చి పశువులకు కట్టు ఇంజక్షన్‌లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

పాడి రైతులకు గొప్పవరం



మాది పిచ్చాటూరు మండలం, రామాపురం గ్రామం. నా పేరు పురుషోత్తం. మాకు 13 పశువులు ఉన్నాయి. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న మేలు జాతి పునరుత్పత్తి పేయ దూడల పథకాన్ని సద్వినియోగం చేసుకుంటాం. నెల రోజులుగా స్థానిక పశువైద్యులు, సిబ్బంది వచ్చి గ్రామంలో పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. పశువులకు సబ్సిడీ ద్వారా అందించే వీర్యకణాల ఇంజక్షన్ పశువులకు వేయించడానికి అంగీకరించా. జగనన్న ప్రభుత్వం పాడి రైతులకు ఇంత గొప్ప పథకం అందిస్తుంటే వద్దంటామా. ధన్యవాదాలు.

సబ్సిడీపై రెండు వీర్య నాళికలు

ఈ పథకం ద్వారా ప్రభుత్వం పశువుల కృత్రిమ గర్భధారణకు అవసరమైన వీర్య నాళికలను సబ్సిడీపై అందజేస్తున్నారు. రెండు వీర్య నాళికల ధర రూ.1,350 కాగా రైతు రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ.850 ప్రభుత్వమే సబ్సిడీగా అందజేస్తుంది. ఒక వేళ రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ చేసిన తర్వాత కూడా పశువు గర్భం దాల్చకపోతే రైతు చెల్లించిన మొత్తం రూ.500 ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. మొదటి సారి గర్భం దాల్చిన పశువుకు మగ దూడ పుడితే ఎటువంటి మొత్తం తిరిగి చెల్లించరు. రెండవసారి గనుక మగ దూడ పుడితే రూ.250 తిరిగి చెల్లిస్తారు.

పిచ్చాటూరు: రాష్ట్ర ప్రభుత్వం పాడిపరిశ్రమకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా పాడి సంపద అభివృద్ధికి చర్యలు చేపట్టింది. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు మేలు జాతి పునరుత్పత్తికి సంకల్పించింది. పశువులు, జీవాల ఆరోగ్య సంరక్షణకు ఇప్పటికే 1,962 సంచార పశువైద్యశాలలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పశువులకు సరైన రోగ నిర్ధారణ చేసి, మరణాలను అరికట్టేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఆవులు, గేదెలు మేలు రకం పేయ దూడలకు జన్మనివ్వడానికి, పాల ఉత్పత్తిని పెంచడానికి ‘రాష్ట్రీయ గూకుల్ మిషన్’ ద్వారా మేలు జాతి పునరుత్పత్తి పథకాన్ని ప్రారంభించింది. దీనిద్వారా పాడి రైతులకు సబ్సిడీపై లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్‌లను అందజేస్తోంది. తద్వారా పాల ఉత్పత్తిని, మేలు రకం పేయ దూడల పునరుత్పత్తిని పెంచనుంది. ప్రస్తుతం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ పథకాన్ని చురుగ్గా అమలు చేస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 9 వేల ఇంజక్షన్‌లు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే ఇందులో 7 వేల డోసులు పంపిణీ చేసింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో 2 వేల ఇంజక్షన్‌లు పశువులకు వేసినట్లు పశువైద్య శాఖ యంత్రాంగం పేర్కొంటోంది.

పథకం ఉద్దేశం ఇదీ

జిల్లాలోని అన్ని మండలాల్లో పాడి సంపదను పెంచడం పథకం ప్రధాన ఉద్దేశం. ఆవులు, గేదెలకు మేలుజాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి ఆడ(పెయ్య) దూడలను ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కచ్చితంగా 90 శాతం పేయ దూడలనే పుట్టించడం, సదరు సాంకేతికతను రైతుల చెంతకు తీసుకెళ్లడం.. తద్వారా భవిష్యత్తులో అధిక శాతం మేలు జాతి పశువుల సంఖ్యను పెంచాలని సంబంధిత అధికారులు యోచిస్తున్నారు. అంతే గాకుండా పాల ఉత్పత్తిని, పాడి రైతుల ఆదాయాన్ని పెంచడానికి ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మేలు జాతి ఆడ దూడలను ఉత్పత్తి చేసే వీర్య కణాలను పశువులకు అందిస్తున్నారు.



పిచ్చాటూరు మండలం, అప్పలరాజుకండ్రిగలో ఇంజక్షన్ వేస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ మంజుల

పిచ్చాటూరు మండలంలో 7 గ్రామాల ఎంపిక

పిచ్చాటూరు మండలంలో రామాపురం, చెంచురాజు కండ్రిగ, అడవికొడియంబేడు, వెంగళత్తూరు, పులికుండ్రం, అప్పలరాజుకండ్రిగ, పిచ్చాటూరు గ్రామాలను మొదటి విడతలో ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఆసక్తి గల రైతులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. రైతులకు పథకం ఉద్దేశంపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు ఎంపిక చేసిన 7 గ్రామాల్లో 10 పశువులకు 10 ఇంజక్షన్‌లు వేసినట్టు మండల పశువైద్యాధికారి ధనంజయులు వెల్లడించారు.

లింగ నిర్ధారణ వీర్య కణాల రకాలు
విదేశీ జాతులు
జెర్సీ, హెచ్‌ఎఫ్, వాటి క్రాస్ బ్రీడ్,
స్వదేశీ జాతులు
గిర్, సాహివాల్ గేదెల్లో ముర్రె

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ఆవులు	:	9,50,152
గేదెలు.	:	86,680
గొర్రెలు.	:	16,96,765
మేకలు	:	5,35,194

పాల ఉత్పత్తి పెరుగుదలే లక్ష్యం



రాష్ట్రీయ గోకుల్‌మిషన్ పథకం ద్వారా ఆడ దూడల ఉత్పత్తి గణనీయంగా పెంచి తద్వారా పాల ఉత్పత్తిని పెంచుకోవాలన్నదే ప్రభుత్వ అంతిమ లక్ష్యం. దీని ద్వారా లింగ నిర్ధారిత మేలు జాతి వీర్య కణాల ఇంజక్షన్‌లను సబ్సిడీపై రైతులకు అందిస్తున్నాం. రైతు ఆమోదం మేరకు రూ.1350 విలువ చేసే రెండు వీర్యకణాలను రూ.500కే పశువులకు వేస్తున్నాం. ఈనిన పశువులు, 1 నుంచి 3 ఈతల మధ్య క్రమంతప్పకుండా ఎదకు వచ్చే పశువులు, ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేని వాటిని ఎంపిక చేస్తున్నాం. –డాక్టర్ వై.ఇందిర, ఏడీ, పశువైద్య శాఖ, పిచ్చాటూరు.

మెకానిజంలోనూ పట్టు సాధించండి



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: డ్రైవింగ్‌లో మెలకువలే కాకుండా మెకానిజంలోనూ పట్టు సాధించాలని తిరుపతి జిల్లా డెప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ (డెప్యూటీ సీఎంఈ) నరసింహులు పిలుపునిచ్చారు. అలిపిరి డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో 18వ బ్యాచ్ శిక్షణ పూర్తి కావడంతో వారికి శుక్రవారం వీడ్కోలు పలికారు. అలాగే 19వ బ్యాచ్‌కి స్వాగతం పలికి, శిక్షణ ప్రారంభించారు. ఈనెల 5వ తేదీ నుంచి 20వ బ్యాచ్‌కి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డెప్యూటీ సీఎంఈ మాట్లాడుతూ జిల్లాలో ఏకైక డ్రైవింగ్ స్కూల్ అలిపిరి డిపో మాత్రమేనన్నారు. మూడేళ్లుగా ఈ స్కూల్‌ను దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటి వరకు 18 బ్యాచ్‌లకు ఒక్కో బ్యాచ్‌లో 16 మంది చొప్పున 290 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి సరిఫికెట్లు జారీ చేసినట్టు తెలిపారు. తిరుపతి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్‌కు దేశవిదేశాల్లో సైతం భలే గిరాకీ ఉందన్నారు. అలిపిరి డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ హరిబాబు మాట్లాడుతూ ఒక్కో బ్యాచ్‌కి 16 మందిని మాత్రమే ఎంపిక చేస్తున్నట్టు వెల్లడించారు. డ్రైవింగ్ స్కూల్ కో- ఆర్డినేటర్ టీ.రాము, శిక్షణా ప్రతినిధులు సీవీ గోపాల్, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శిష్య స్వీకార మహోత్సవం



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ దేవి సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా శిష్య స్వీకార మహోత్స కార్యక్రమం జరిగింది. జ్ఞానప్రసూనాంబ దేవి సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న సురేష్ గురుకుల్‌కు శివ గురువు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ ఆశీర్వాదంతో శివదీక్ష శిష్య స్వీకరణ జరిగింది. ఈ సందర్భంగా హోమపూజలు నిర్వహించారు. అనంతరం సురేష్ గురుకుల్ దంపతులకు కలశ తీర్థ అభిషేకం, పంచ హారతులు అందించారు. శాంతమ్మ, శ్రీకాళహస్తీశ్వర గురుకుల్, కృష్ణమూర్తి గురుకుల్, పరశురామ్ గురుకుల్, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

రుయా అధికారులకు నోటీసులు

తిరుపతి తుడా : ఆరోగ్యశ్రీ ఆసరా నిధుల గోల్‌మాల్‌పై రుయా అధికారులకు పోలీసులు నోటీసులు జారీచేశారు. రుయా సూపరింటెండెంట్ నాగమునీంద్రుడుతోపాటు డాక్టర్ రాధారాణి, డాక్టర్ మునీశ్వరరెడ్డికి అలిపిరి సీఐ అబ్బన్న శుక్రవారం రాత్రి నోటీసులు అందజేశారు. అవతవకలపై పూర్తి వివరాలు అందించాలని కోరారు. ఆరోగ్యశ్రీని పరిరక్షించాల్సిన మెట్రికో పైన చర్యలకు దిగనున్నారు. ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు.

FORM NO.14 {See Regulation 33(2)}
By Regd. A/D, Dasti failing which by Publication
OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)
1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001.

DEMAND NOTICE
NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/59/2019 14-02-2023

CANARA BANK
Versus
M. RAMACHANDRA NAIDU

To
(CD-1) **M. Ramachandra Naidu,** Plot No 83, Srinivasapuram Tiruchanoor Road, Tirupati, Andhra Pradesh-517 501.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 2) in OA/717/2018** an amount of **Rs 8548342.00 (Rupees Eighty Five Lakhs Forty Eight Thousands Three Hundred Forty Two Only)** along with pendentelite and future interest 8.85 % w.e.f. 19.01.2019 till realization and costs of Rs 0 (Only) has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **18/04/2023** at **10:30** a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
(a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date 14-02-2023
Sd/- Recovery Officer
Debts Recovery Tribunal Hyderabad (DRT 2)

టాప్ 'టెన్' లక్ష్యం!



విద్యార్థి భవిష్యత్‌లో పదో తరగతి కీలక ఘట్టం. ఇందులో ప్రతిభే భవితకు గీటురాయి. అందుకే దీన్ని సమరంగా భావిస్తారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. అయితే ఇప్పటి వరకు పడ్డ కష్టం ఒక ఎత్తయితే.. ఇకముందు చేసే కసరత్తు మరో ఎత్తు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ పదో తరగతి పరీక్షల షెడ్యూలు విడుదల చేశాయి. ఏప్రిల్ 3 నుంచి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదవాల్సి ఉంటుంది. ఇందుకు తగ్గట్టుగా విద్యాశాఖాధికారులు కూడా ప్రణాళిక రూపొందించి అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పరిస్థితిలో పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

తిరుపతి జిల్లా సమాచారం		
పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు	-	26,673
ప్రైవేటు విద్యార్థులు	-	1,740
హాజరయ్యే విద్యార్థులు	-	28,413
పాఠశాలల సంఖ్య	-	580
పరీక్షా కేంద్రాలు	-	152

- ఉత్తమ ఫలితాల సాధన దిశగా అడుగులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- మెరుగైన ఫలితాలు సాధించేలా శిక్షణ
- ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక తరగతులు
- పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్న విద్యాశాఖ

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చాటాలని విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ప్రతి ఒక్క విద్యార్థీ పూర్తిస్థాయిలో జీపీఏ దక్కించుకునేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ పరిసితుల్లో ఫెయిల్ అనేదానికి తావు ఇవ్వకుండా లక్ష్యం వైపు దూసుకుపోతున్నారు. ఆ దిశగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇక నుంచి చేసే పునఃశ్చరణతోపాటు చదువులో వెనుకబడిన వారిని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు చర్యలు వేగవంతం చేశారు. సిలబస్‌ను పూర్తిచేసి సబ్జెక్టుల వారీగా పాఠాల వారీగా విద్యారుల జ్ఞాపకశక్తిని అంచనా వేసేందుకు రివిజన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిని వెంటనే దిద్ది ఎక్కడ లోపం ఉందో గుర్తించి స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. దీని కోసం ప్రత్యేక ప్రణాళికను అమలు చేసేందుకు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రణాళికను తయారు చేసి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇందులో ప్రతీ రోజూ దినసరి నివేదికలను తయారుచేసి తిరుపతి జిల్లా బాలబాలికలు పదికి పది జీపీఏ సాధించే దిశగా జిల్లా విద్యాశాఖ నిపుణులు పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక సదుపాయాలు

రివిజన్ ప్రణాళికలో భాగంగా ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టారు. పదో తరగతి విద్యార్థులకు అదనపు సదుపాయాలను అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. రాత పుస్తకాలు, స్టడీ మెటీరియల్, కెరీర్ గైడెన్స్ పుస్తకం, పరీక్షల ప్యాడ్, స్టీల్ మెటల్ స్కేల్, మ్యాపులు, కంపాస్ బాక్స్, గ్రాఫ్ పుస్తకం, పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్‌నర్, కాలుక్యులేటర్, వాచ్‌లను దాతల ద్వారా సమకూర్చుతున్నారు.

ఇవి పాటించడం ఉత్తమం

- పాఠ్యాంశాల వారీగా ప్రగతి సాధించేందుకు పక్కా ప్రణాళిక పాటించాలి.
- వీలున్నంత వరకు సెల్‌ఫోన్లు, టీవీలు, సినిమాలకు దూరంగా ఉండాలి.
- విద్యారులు వీలైనంత సేపు పాఠ్యాంశాలను రివైజ్ చేసుకుంటూ సాధన చేయాలి.
- ఆరోగ్యానికి ప్రాధాన్యతను కల్పించి క్రమపద్ధతిలో విశ్రాంతి కల్పించాలి.
- నిద్ర లేకుండా చదివినా అది ఇబ్బందికరమని గుర్తించాలి.

మారిన విధానం, ప్రశ్నపత్రం

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల విధానం కొంత మారింది. నమూనా ప్రశ్నపత్రాలను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. గత ఏడాది పబ్లిక్ పరీక్షల్లో భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రం సబ్జెక్టులకు పరీక్షను విడివిడిగా పెట్టారు. మారిన పరీక్షల విధానంలో భాగంగా ఈ ఏడాది నుంచి పీఎస్, ఎన్ఎస్ సబ్జెక్టులను ఒకే ప్రశ్నపత్రంలో ఇవ్వనున్నారు. నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానంలో ప్రశ్నలను ఇవ్వబోతున్నారు. బిట్ పేపరును విడిగా ఇవ్వడం లేదు.

విజయసాధన పరీక్షలు రాస్తున్నాం



ఏప్రిల్‌లో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చాను. మా పాఠశాలలో రోజూ ఉదయం, సాయంత్రం విజయ సాధన పరీక్షలు రాస్తున్నాం. అన్నీ సబ్జెక్టులలో పాఠ్యాంశాలు వారీగా జరుగుతున్న ఈ పరీక్షలు పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుంటున్నాం. మంచి మార్కులు తెచ్చుకోవడానికి మా ఉపాధ్యాయులతో సందేహాలు నివత్తి చేస్తున్నారు.

- స్పందన, పదో తరగతి, జెడ్పీహైస్కూల్, కల్లివెట్టు, బీఎస్.కండ్రిగ


ఇంటివద్దకే వచ్చి..



రోజూ విజయ సాధనతో పరీక్షలు రాయడం చేత భయం తొలగిపోతోంది. మా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అందరూ పాఠశాలలో బోధనతో పాటు రాత్రి పూట సందర్శనలో భాగంగా మా ఇంటి వద్దకు వచ్చి తల్లిదండ్రులకు మా సామర్థ్యాలను తెలుపుతూ సందేహాలు తీర్చుతున్నారు. ఈ నెల రోజులు పిల్లలకు చదువుకునే వాతావరణం కల్పించాలని చదువు ప్రాధాన్యత మా తల్లిదండ్రులకు తెలుపుతున్నారు.

- భవ్య, కావ్య, పదో తరగతి, జెడ్పీహైస్కూల్, కల్లివెట్టు, బీఎస్.కండ్రిగ

మంచి ఫలితాలు సాధిస్తాం



పదో తరగతి పబ్లిక్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించే దిశగా అన్ని చర్యలు తీసుకున్నాం. హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు అందిన సూచనలకు అనుగుణంగా మంచి ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. వెనుకబడ్డ అంశాలపై దృష్టి సారిస్తున్నాం. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో జిల్లాను టాప్‌లో ఉంచడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగాగా కృషి చేస్తున్నారు.

- డాక్టర్ వి.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి



మృతి చెందిన మునెయ్య

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని పుదూరు గ్రామంలో కోబాక మునెయ్య(90) అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈమేరకు మృతుని భార్య పద్మమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. పుదూరు గ్రామానికి చెందిన మునెయ్య, పద్మమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె ఉంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మునెయ్యకు నాయుడుపేట పట్టణంలో ఉన్న ఓ మనవడి మధ్య కొంతకాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మధ్యహ్నం పుదూరుని ఇంట్లో మునెయ్య మంచంపై మృతిచెంది ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మునెయ్య మృతి చెందిన మంచం పక్కనే తన మృతికి కారణం మనవడే కారణమంటూ ఓ కాగితం అతికించి ఉండడాన్ని గమనించారు. గోడకు అతికించి ఉన్న కాగితంలో రాసిన అక్షరాలు, మృతుడి డైరీలో రాసుకుని ఉన్న అక్షరాల తేడాను గమనించారు. వృద్ధుడు సహజంగా మృతి చెందాడా, లేక మరేదైనా కారణం ఉందా..? అనే కోణంలో విచారిస్తున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తడ: మండల పరిధిలోని తడ, అక్కంపేట రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్ఐ జీ మాలకొండయ్య తెలిపిన వివరాల మేరకు.. చేనిగుంట గ్రామానికి దిగువన, కరిపేటి కాలువ వంతెన సమీపంలో సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి రైలుకింద పడిపోవడంతో తల, మొండెం వేరైంది. సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చిరుత కలకలం

పాకాల: మండలంలోని లింగనపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం చిరుత సంచరిస్తూ కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆటో డ్రైవర్ రమేష్ శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో పెనుమూరు వెళుతుండగా సబ్‌స్టేషన్ సమీపంలో చిరుత రోడ్డుకు తూర్పు నుంచి పడమర వైపు వస్తోంది. ఆటో లైట్ వెలుతురు పడడం, హారన్ వేయడంతో వెనుదిరిగి గుట్టలోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. సమాచారాన్ని వెంటనే అటవీ సిబ్బందికి సమాచారం అందజేశారు. ఉదయం 11 గంటలకు అటవీ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిసరాలను పరిశీలించి చిరుత సంచారం ఉందని గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. అచ్చమ్మ అగ్రహారం, గాండ్లపల్లి, లింగనపల్లి, కవాలివారిపల్లి గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు సూచనలు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



సాయికృష్ణ (ఫైల్)

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని చలివేంద్రం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓజిలి మండలం, మనవాలి గ్రామానికి చెందిన చిల్లకూరు సాయికృష్ణ(30) మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. మనవాలి గ్రామానికి చెందిన సాయికృష్ణ గురువారం రాత్రి ట్రాక్టర్‌కు డీజిల్ పట్టించేందుకు చలివేంద్ర సమీపంలోని పెట్రోల్ బంక్‌కు వచ్చాడు. తిరిగి బైక్‌లో గ్రామానికి వెళుతుండగా ఫోన్ రావడంతో బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి మట్లాడుతుండగా మేనకూరు గ్రామం వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సాయికృష్ణను స్థానిక ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ



మృతి చెందిన లాల్‌బాషా

– ఒకరి మృతి

చంద్రగిరి: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరుకు చెందిన లోకేష్ తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం చిత్తూరు నుంచి విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్ర వాహనంలో తిరుపతికి పయనమయ్యాడు. ఈ క్రమంలో చంద్రగిరి ఇందిరమ్మ కాలనికి చెందిన లాల్‌బాషా(35) మరో వృద్ధుడితో కలిసి ద్విచక్ర వాహనంలో చంద్రగిరి వైపుగా వస్తున్నాడు. ఈ క్రమంలో తొండవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న లోకేష్ ద్విచక్ర వాహనాన్ని లాల్ బాషా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లాల్ బాషా అక్కడికక్కడే మృతిచెందగా.. మరో వృద్ధుడు, లోకేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి ఆత్మహత్య



వంశీ (ఫైల్)

కేవీబీపురం: కేవీబీపురం దళితవాడలో శుక్రవారం బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. దళితవాడకు చెందిన చంద్రయ్య కుమారుడు వంశీ(16) కూలి పనులు చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. ఏమి జరిగిందో కాని శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

ఆటో బోల్తా - మహిళ మృతి

- 14 మందికి గాయాలు



నాగలాపురం మండలం కారణి సమీపంలో జాతీయ రహదారిపై బోల్తా పడ్డ ఆటో

పిచ్చాటూరు: షేర్ ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందికి గాయాలు కాగా అందులో ఒకరు మృతిచెందిన ఘటన నాగలాపురం మండలం, కారణి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. శుక్రవారం ఉదయం 11 గంటలకు నాగలాపురం నుంచి ఊత్తుకోటకు షేర్ ఆటో బయలుదేరింది. ఆటోలో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. కారణి–సురుటపల్లి మధ్యలో ఆటో అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఇందులో నాగలాపురం మండలం, సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన లలితమ్మ(56) తీవ్రంగా గాయపడింది. ఆమెను నగరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందింది. అలాగే నాగలాపురం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మరో 14 మందికి స్వల్పగాయాలయ్యాయి. అయితే ఈ ప్రమాదంపై సాయంత్రం వరకు నాగలాపురం పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఆటోలో స్థాయికి మించి ప్రయాణికులు ఉండడం వల్లే బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు.

రామగిరిలో కారును ఢీకొన్న స్కూటరిస్టు

పిచ్చాటూరు మండలం, రామగిరి సమీపంలో కారును స్కూటరిస్టు ఢీకొట్టడంతో డిస్కో నాయుడు(51) అనే వ్యక్తికి కాలు విరిగింది. శుక్రవారం సాయంత్రం పుత్తూరు వైపు వెళ్తున్న కారును ఎదురుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న డిస్కో నాయుడు ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

నిరంతర నిఘా



ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

- దొంగతనాలను అరికట్టడమే లక్ష్యం
- మారుమూల నివాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి ఇంటికీ సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన
- రహదారులు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- ముత్యాలరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీలో ఎస్పీ వెల్లడి

సాక్షి, తిరుపతి: 'దొంగతనాలు.. అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ఇంటికీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి'అని ఎస్పీ పీ పరమేశ్వర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. తిరుపతి రూరల్ మండలం, ముత్యాలరెడ్డిపల్లి పోలీస్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎస్‌హెచ్‌ఓ, పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరుపై సమీక్షించి జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి పలు రికార్డులను పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మారుమూల నివాస ప్రాంతాలపై నిరంతనిఘా పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమరవాణాను అరికట్టే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. జాతీయ రహదారులపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మత్తు పదార్థాలు సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి

పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా ఎంఆర్‌పల్లి పోలీస్టేషన్ తనిఖీలోనూ పెండింగ్ కేసుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేసులను సకాలంలో దర్యాప్తు చేసి బాధితులకు సరైన న్యాయం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మహిళా సంబంధిత నేరాలపై వెంటనే స్పందించాలన్నారు.

సిబ్బందితో మమేకమైన ఎస్పీ

పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి సాదకబాదలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని చెప్పారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా విధుల్లో మానవతా దృక్పథంతో నిక్కచ్చిగా ఉండాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి మేమున్నామనే ధైర్యాన్ని ఇచ్చి భరోసా కల్పించాలని చెప్పారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరుపై సమీక్షించిన అనంతరం వారితో మాట్లాడుతూ నేటి సమాజంలో గృహ నిర్బంధ మహిళా సంబంధిత విషయాలను, బాలికలు ఎదుర్కొంటున్న ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం వంటి విషయాలపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బాలికల పట్ల ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తనపై ఆరాతీసి ఏదేని అనుకోని సంఘటనలు జరిగి ఉంటే వెంటనే ఎస్‌హెచ్‌ఓలకు తెలియజేసేవిధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట తిరుపతి వెస్ట్ డీఎస్పీ నరసప్ప, సీఐలు సురేంద్రరెడ్డి ఎమ్ఆర్.పల్లి, చంద్రశేఖర్‌పిళ్లై, డీసీఆర్‌బీ ఎస్ఐలు పాల్గొన్నారు.